గెలిపించండి.. ఐదేళ్లు మీ కోసం పనిచేస్తా..

● చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

రాజేంద్రనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిపిస్తే ఐదేళ్లు మీ కోసం పనిచేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్యనేతలు గురువారం జూబ్లీహిల్స్‌లో రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఇంటి తలుపులు ఎల్లవేళలా ప్రజల కోసం తెరిచే ఉంటాయని అన్నారు. ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేస్తుందని వివరించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ నాయకులు రాపోలు సత్తయ్య, కె.సత్యనారాయణగౌడ్, నారాయణస్వామి, పెదిరిపాటి శేఖర్‌గౌడ్ ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఎ.దేవదాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రాపోలు సత్తయ్య, కె.సత్యనారాయణగౌడ్, నారాయణస్వామి, పి.శేఖర్‌గౌడ్

మహేశ్వరంలో ఇంటింటి ప్రచారం

మహేశ్వరం: రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అనితారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ కోరారు. గురువారం అమీర్‌పేట, గట్టుపల్లి, మన్‌సాన్‌పల్లి, డబిల్‌గూడ, మహేశ్వరం, తుమ్మలూరు, మొహబత్‌నగర్, కోళ్లపడకల్, దిల్వార్‌గూడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ పేద ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ సందర్భంగా అమీర్‌పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంజయ్య డబిల్‌గూడకు చెందిన ఇస్తారితోపాటు ఆయా గ్రామాలలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనితారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రచారంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీత అంద్యానాయక్, మర్యాద రాఘవేందర్‌రెడ్డి, దేవేందర్ నాయక్, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అల్విన్ కాలనీలో భారీ మెజార్టీ సాధిస్తాం

హైదర్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి అల్విన్ కాలనీలో భారీ మెజారిటీ సాధిస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ ఇన్‌చార్జి గిరి ప్రసాద్‌రెడ్డికితో కలిసి పలు కాలనీల ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కార్పొరేటర్ కోరారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమక్షంలో పీజేఆర్‌గర్ ఫేజ్-2 వాసులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

రంజిత్‌రెడ్డికి మద్దతుగా బడంగ్‌పేట మేయర్ ప్రచారం

సరూర్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా బడంగ్‌పేట కార్పొరేషన్‌లో మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు గురువారం ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాలాపూర్ పాత గ్రామంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



బాలాపూర్‌లో ప్రచారం చేస్తున్న బడంగ్‌పేట్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి



బడంగ్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి తదితరులు



కాలనీవాసుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

దశాబ్దాలుగా కాంగ్రెస్ నినాదాలకే పరిమితం

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

పేట్‌బషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ నినాదాలకే పరిమితమైంది తప్ప, ప్రజలకు నిజమైన ఫలితాలు అందించలేదని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ భూమిరెడ్డి కాలనీ, స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, భీమాస్రైడ్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో నాయకులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం, అపార్ట్‌మెంట్ వాసులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2013 వరకు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థలు మూడుంటే.. మోదీ హయాంలో ఆ సంఖ్య 16కు చేరిందన్నారు. కమలం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి, జీడిమెట్ల అధ్యక్షుడు పులి బలరామ్ పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ వాసుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మోసగించే ప్రకటనలు చేయొద్దని సీఎంకు చెప్పాలి

కొత్తపేట: రేవంత్‌రెడ్డికి ఇంకా మోసగించే ప్రకటనలు చేస్తే నడవదు బిడ్డా అని చెప్పాలె' అని బీజేపీ మల్కాజిగిరి నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ ఓటర్లకు సూచించారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం శివగంగ కాలనీ సదాశివేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శివమ్మనగర్, అంబేడ్కర్‌నగర్, భరత్‌నగర్-1, 2, రాజీవ్‌గాంధీనగర్ -1, 2 బస్తీల్లో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డితో కలిసి పాదయాత్ర చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే బస్తీలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకుడు యశ్‌పాల్ ఈ సందర్భంగా ఈటలకు తులసిమాల వేసి ఖడ్గం బహూకరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నంగికొండ గీతారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కొత్తపేటలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

భారీ మెజార్టీతో గెలిపించండి

వనస్థలిపురం: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీ గెలిపించాలని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మల్లికార్జున నగర్ సంక్షేమ సంఘం భవనంలో ఆదర్శ్ సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఈటల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మల్కాజిగిరి ఎంపీగా భారీ మెజార్టీతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు మద్దతుగా పార్కులో ప్రచారం

అల్లాపూర్: మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు కోరారు. గురువారం ఐడీఎల్ వాకింగ్ ట్రాక్, కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్ 1, జీహెచ్‌ఎంసీ పార్కులో ప్రచారం నిర్వహించారు. వాకర్స్‌ను కలిసి కమలం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. బాలాజీ నగర్ 115వ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, సోమశేఖర్, తిరుపతి, సత్యనారాయణ, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా కన్వీనర్ సుహాసిని శక్తి ఆధ్వర్యంలో గురువారం నిజాంపేట కార్పొరేషన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు శివగణేష్, ప్రవీణ్‌కుమార్, అగ్ని తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే మల్కాజిగిరి అభివృద్ధి

రాగిడి లక్ష్మారెడ్డి

అల్లాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా అల్లాపూర్‌లో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ర్యాలీకి మహిళలు బోనాలు, బతుకమ్మలతో తరలివచ్చారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ పాల్గొన్నారు.



అల్లాపూర్ ర్యాలీలో రాగిడి లక్ష్మారెడ్డి

పార్కులో ఎమ్మెల్యే ప్రచారం

ఓల్డుబోయినపల్లి: రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం ఉదయం హెచ్ఏఎల్ పార్కులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



ఏఎస్‌రావునగర్‌లో పూరీలు వేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

ఏఎస్‌రావునగర్‌లో ఇంటింటి ప్రచారం

ఏఎస్‌రావునగర్: రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఏఎస్‌రావునగర్‌లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రంగారెడ్డినగర్‌లో...

పేట్‌బషీరాబాద్: రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ రంగారెడ్డినగర్ డివిజన్‌లో కార్పొరేటర్ బి. విజయశేఖర్‌గౌడ్ గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

బాలానగర్‌లో..

బాలానగర్: రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి బాలానగర్‌లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డాక్టర్ టి.రఘునాథస్వామి

లేయర్స్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ సీజ్

కేపీహెచ్‌బీకాలనీ, మే 9 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా కేపీహెచ్‌బీలో నిర్వహిస్తున్న లేయర్స్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా.టి.రఘునాథస్వామి గురువారం సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా క్లినిక్‌లో దంత వైద్యులను నియమించడం, చర్మసంబంధమైన ప్రక్రియలు నిర్వహించడంపై తమకు ఫిర్యాదులు అందాయన్నారు. విచారించి పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో క్లినిక్‌ను సీజ్ చేశామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ గీతా ప్రసాద్, డాక్టర్ సౌమ్య, ఎస్ఐ శ్రీనివాస రావు, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించండి

సరూర్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో 1వ డివిజన్‌లో కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కాసాని కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాసాని పెద్ద కోడలు మాధవి, చిన్న కుమారుడు సాయి ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.



బడంగ్‌పేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాసాని కోడలు మాధవి, కుమారుడు సాయి తదితరులు

కాసానికి మద్దతు ఇవ్వండి

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చర్చిల పాస్టర్‌లతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతు తెలిపాలని, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, హఫీజ్‌పేట డివిజన్ అధ్యక్షుడు బాలింగ్‌గౌతంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో సాయిబాబా ప్రచారం

రాయదుర్గం: బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా నాయకులతో కలిసి గురువారం గోపన్‌పల్లితండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

కాసానికి బీసీలు అండగా ఉండాలి

రాజేంద్రనగర్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. మైలార్‌దేవుపల్లి దుర్గా కన్వెన్షన్‌లో గురువారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా బీసీల హక్కుల కోసం పోరాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు బీసీలంతా అండగా ఉండాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేందర్‌గౌడ్, పుటం పురుషోత్తంరావు, తలారి మల్లేశ్, ప్రకాశన్న యువసేన అధ్యక్షుడు టి.రాముగౌడ్, లక్ష్మీరాజ్, గుమ్మడి కుమార్, డి.రమేశ్ ముదిరాజ్, వజ్రమ్మ, ఎడ్లకాడి సూర్యం, బి.రాజేశ్ యాదవ్, భూదేవి, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

భారీ మెజార్టీతో గెలిపిస్తాం

చేవెళ్ల: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ, పలుగుట్ట, నారాయణదాస్‌గూడ, లొద్ది, కేసారం, దేవరంపల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

బీసీల మద్దతు బీఆర్ఎస్‌కే

చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో బీసీల మద్దతు కాసాని జ్ఞానేశ్వర్‌కే ఉంటుందని మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలో ఓ ఫామ్ హౌస్‌లో చేవెళ్ల నియోజకవర్గంలోగల బీసీ కుల సంఘాల నాయకులు కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలందరూ ఐక్యంగా ఉండి కాసాని గెలుపునకు కృషి చేయాలన్నారు. బీసీలకు వచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ సమావేశంలో ఐదు మండలాలకు చెందిన అన్ని బీసీ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



చర్చి పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మహిళా సాధికారతకు మోదీ ప్రభుత్వం కృషి

గచ్చిబౌలి, మే 9 (ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారితకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ అన్నారు. గురువారం గచ్చిబౌలి సంధ్య కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన నారీ శక్తి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వనతి శ్రీనివాసన్, సంగీతారెడ్డి

చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి కోసం ముద్రా రుణాలు ఇవ్వడంతోపాటు అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, బీజేపీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్తు అడ్మిషన్‌లు ప్రారంభం

దుండిగల్, మే 9 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్తు అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ అలివేలు మంగమ్మ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, ఎంపీసీ, బీజెడ్సీ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

వివరాలకు బహదూర్‌పల్లిలోని కళాశాలలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించవచ్చన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గాజులరామారం, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుదర్శన్‌నగర్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనులకు మహేష్(27), శేఖర్(29) గురువారం వెళ్లారు. మహేష్ మొదటి అంతస్తు స్లాబ్‌పై కవర్ కప్పుతుండగా సమీపంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో కిందపడ్డాడు. గమనించిన తోటి కార్మికులు అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. భవన యజమాని, సివిల్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే తన భర్త చనిపోయాడని మృతుడి భార్య రోహిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలలతో పనిచేయిస్తున్న యజమానులపై కేసు

బాలుడితో పనిచేయిస్తున్న బేకరీ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సూరారం సాయిబాబానగర్‌లో అల్మాస్ బేకరీలో కర్ణాటకకు చెందిన విజయకుమార్(15) పనిచేసున్నాడు. సమాచారం అందుకున్న మేడ్చల్, బాలానగర్ స్మైల్ టీమ్ బేకరీకి చేరుకొని బాలుడిని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. బేకరీ యజమాని భగత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

● సూరారం పాండు బస్తీలో లేజర్ సేవింగ్ ప్రొడక్ట్స్ పరిశ్రమపై బాలానగర్ స్మైల్ టీమ్ దాడిచేసి అందులో పనిచేస్తున్న ఇద్దరు బాలురను రక్షించారు. బాలురతో పనిచేయిస్తున్న పరిశ్రమ యజమానిపై బాలల సంరక్షణ అధికారి అరుణ్ జంజల్ సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీవారి కల్యాణం

కేపీహెచ్‌బీకాలనీ, మే 9 (ఆంధ్రజ్యోతి): శ్రీలాపార్క్‌ప్రైడ్‌లో పద్మావతి సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ద్వాదశ (పుష్కర) వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కర్మయ్యగారి కొండల్‌రావు, తిలోత్తమ దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ స్వామి వార్లను దర్శించుకున్నారు. అతిథులకు కాలనీ అధ్యక్షుడు అల్లూరి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించి శ్రీవారి పటాలు అందజేశారు.

కుత్బుల్లాపూర్‌లో సమ్మర్ ఉత్సవ్ మేళా

● నేడు, రేపు ఉచిత ప్రవేశం

కుత్బుల్లాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మున్సిపల్ మైదానంలో సమ్మర్ ఉత్సవ్ మేళా ఏర్పాటు చేశారు. ఇందులో అవతార్ సినిమాలో వివిధ పాత్రల్లో కనిపించిన గ్రహాంతర వాసుల(ఏలియన్స్)తోపాటు 15 రకాల వివిధ రైడ్లు, ఎమ్యూజ్‌మెంట్ రైడ్లు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేశారు. శుక్ర, శని వారం సందర్శకులకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నామని, మేళా ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతుందని మేనేజర్ కేఎం డేవిడ్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతోమందికి మేలు

మల్కాజిగిరి అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం, మే 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతోమందికి మేలు జరుగుతుందని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్, మల్లంపేట్, బౌరంపేట్, దుండిగల్, గాగిల్లాపూర్, బహదూర్‌పల్లి, దూలపల్లి, కొంపల్లిలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హస్తం గుర్తుకు ఓటేసి సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నిజాంపేట్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులను కేటాయించి ఆదర్శ మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, జ్యోత్స్న శివారెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో ప్రచారం చేస్తున్న సునీతారెడ్డి కుమార్తె మనీష

అమ్మను గెలిపించండి : మనీష

అల్లాపూర్: సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆమె కుమార్తె మనీష కూకట్‌పల్లిలో గురువారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు తదితరులతో కలిసి ఇంటింటికి వెళ్లి హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

బాలానగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్, వామపక్షాల నాయకులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో గురువారం బాలానగర్‌లో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం నాయకులు మాట్లాడారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, కూకట్‌పల్లి కో-ఆర్డినేటర్ వినయ్‌రెడ్డి, అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, సీపీఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం, సీపీఐ కూకట్‌పల్లి ఇన్‌చార్జి ఐలాపురం రాజశేఖర్, ఎంఐఎం నాయకుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్‌లో మాట్లాడుతున్న సునీతా మహేందర్‌రెడ్డి

ఫతేనగర్: సునీత మహేందర్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి గురువారం భరత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై 'యువమోర్చా'కు దిశా నిర్దేశం

కుత్బుల్లాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్‌ను విశ్వగురుగా నిలబెట్టే నాయకుడు ప్రధాన నరేంద్ర మోదీ అని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు యువమోర్చా నాయకులు కృషి చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి బీజేపీ పరిశీలకుడు డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బీజేవైఎం కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ ఒక్కంటి దయాకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన యువమోర్చా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోల్ మేనేజ్‌మెంట్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో బీజేపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, రవి, బీజేవైఎం జిల్లా నాయకులు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.